VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మార్చి 24 సోమవారం2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 243

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





# బెట్టింగ్ భూతం జోలికి వెళ్లొద్దు బ్రో!

యథాలాపంగా ఫేస్‌బుక్ స్క్రోల్ చేస్తున్న ప్రశాంత్‌కు ఒక ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ మెరుస్తూ కనిపించింది. క్యాజువల్‌గా క్లిక్ చేస్తే తాను అభిమానించే నటుడే ఆ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తున్నాడు.రాష్ట్రంలో నిషేధమున్నా యథేచ్ఛగా దందా

ఏడాదిన్నర కాలంలోనే 24 మంది బలవన్మరణం

ఐపీఎల్ ప్రారంభంతో దర్యాప్తు సంస్థల అప్రమత్తం

యథాలాపంగా ఫేస్‌బుక్ స్క్రోల్ చేస్తున్న ప్రశాంత్‌కు ఒక ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ మెరుస్తూ కనిపించింది. క్యాజువల్‌గా క్లిక్ చేస్తే తాను అభిమానించే నటుడే ఆ బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తున్నాడు. వెంటనే స్నేహితుడికి ఫోన్ చేస్తే అతడూ అదే వాడుతున్నానని చెప్పాడు. మరింకేం..సైన్‌ఇన్ అయ్యి తన సత్తా ఏంటో చూపిద్దాం అనుకున్నాడు. ప్రశాంత్‌కు క్రికెట్, ఇతర ఆటల గురించి తెలియకపోయినా అందుబాటులో ఉన్న పలు ప్రెడిక్షన్ ఛానళ్లు, ట్యుటోరియల్ వీడియోలు చూసి రంగంలోకి దిగాడు. మొదట చిన్నగానే మొదలెట్టాడు. కానీ ఆ యాప్‌లో ఉన్న పర్సంటేజ్‌లు, నిష్పత్తులు అతడిని మరింతగా బెట్టింగ్ వైపు పురిగొల్పాయి. పోతే పది..వస్తే వంద అనుకుని తాహతుకు మించి అప్పులు చేసి మరీ పందేలు కాసేశాడు. ఒక్క రాత్రిలో రూ. లక్షల్లో అప్పులు మిగిలేసరికి నిశ్చేష్టుడయ్యాడు. వాటిని తీర్చడానికి ఒకచోట.. దాని కోసం మరోచోట, ఇంకోచోట.. ఇలా మరింతగా ఆ ఊబిలో కూరుకుపోయాడు. చివరికి తీవ్ర ఒత్తిడికి గురై.. చేజేతులా ప్రాణాలు తీసుకున్నాడు. దీనంతటికీ కారణం ఆకర్షణీయ ప్రచారాలతో బెట్టింగ్ భూతం అతడిని లోబరుచుకోవడమే...




# సన్‌రైజర్స్ వీరబాదుడు

## ఇషాన్ కిషన్ 106 నాటౌట్ 47 బంతుల్లో 11/4, 4/6

హైదరాబాద్:పుష్కర కాలం పాటు నిలిచిన ఐపీఎల్ అత్యధిక స్కోరు రికార్డును నిరుడు ఒకే సీజన్లో మూడుసార్లు దాటి సంచలనం రేపిన జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్. లీగ్‌లో అప్పటిదాకా చూడని విధంగా ఆ జట్టు బ్యాటర్లు సాగించిన విధ్వంసకాండ ఒక చరిత్ర. కొత్త సీజన్లో హైదరాబాద్ ఇంకా రెచ్చిపోతుందని, 300 స్కోరుతో రికార్డు నెలకొల్పడమూ ఖాయమన్న అంచనాలు! ఈ అంచనాలకు ఏమాత్రం తగ్గేదే లేదని చాటింది సన్‌రైజర్స్!

ఆరంభ మ్యాచ్ కదా ఆచితూచి ఆడుదామనేమీ అనుకోలేదు హైదరాబాద్ బ్యాటర్లు. క్రీజులోకి అడుగు పెట్టడం ఆలస్యం.. ఊచకోత మొదలుపెట్టేశారు. హెడ్, అభిషేక్, నితీశ్, క్లాసెన్ తమలో గత సీజన్ వాడి ఏమాత్రం తగ్గలేదని చాటారు. కొత్తగా ఆరెంజ్ జెర్సీ తొడుక్కున్న ఇషాన్ కిషన్.. ఆరంభ మ్యాచ్‌లోనే ఆ జట్టు మార్కు విధ్వంసాన్ని అలవాటు చేసుకుని ఏకంగా సెంచరీ బాదేశాడు. ఇంకేముంది ఐపీఎల్‌లో రెండో అత్యధిక స్కోరుతో ఈ సీజన్లో హైదరాబాద్ వేట ఘనంగా ఆరంభమైంది. బౌలర్ల ఘోర వైఫల్యం తర్వాత రాయల్స్ బ్యాటుతో దూకుడు చూపించినప్పటికీ.. లక్ష్యం కొండంత ఉండడంతో ఓటమి వైపే నిలబడక తప్పలేదు.ఐపీఎల్-18ను సన్‌రైజర్స్ హైదరాబాద్ తన మార్కు విధ్వంసంతో మొదలుపెట్టింది. ఆదివారం సొంతగడ్డపై రాజస్థాన్ బౌలింగ్‌ను ఊచకోత కోసిన సన్‌రైజర్స్.. 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట ఇషాన్ కిషన్ (106 నాటౌట్‌బీ 47 బంతుల్లో 11ఐ4, 6ఐ4) విధ్వంసక సెంచరీకి ట్రావిస్ హెడ్ (67బీ 31

మిగతా 2లో

# అన్ని వర్గాలకు కేసీఆర్ గుర్తుకొస్తున్నారు

కరీంనగర్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ఇప్పుడు కేసీఆర్ గుర్తొస్తున్నారని.. ఎప్పుడు ఎన్నికలొచ్చినా గులాబీ జెండాను రెపరెపలాడించాలని ఎదురుచూస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి తెలంగాణ ప్రజల తలరాతను మార్చామని, 16 నెలలుగా ప్రతిపక్ష పాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తున్నామన్నారు. భారాస రజతోత్సవ సభ సన్నాహక సమావేశం ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన పార్టీ శ్రేణులనుద్దేశించి కేటీఆర్ మాట్లాడారు. భాజపా, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలని మోదీ, ఆరు గ్యారంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేశాయని



ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పుడు ఏ మూలకు వెళ్లినా కేసీఆర్ సీఎంగా ఉంటే బాగుండేదనే మాటే వినిపిస్తోందని చెప్పారు. 'కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే వస్తాయ'ని ఎన్నికలకు ముందు కేసీఆర్ పదేపదే చెప్పారని, ఇపుడదే నిజమవుతోందన్నారు. వచ్చే నెలలో వరంగల్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభ దేశం నివ్వెరబోయేలా ఘనంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఇందిరమ్మ రాజ్యమంటే ఎమర్జెన్సీ రోజులే!

ఇందిరమ్మ రాజ్యం పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, తన పాలనలో నాటి ఎమర్జెన్సీని తలపించే రోజులను తీసుకొచ్చిందని కేటీఆర్ అన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన వారిని పట్టుకోవడమే పోలీసుల పనిగా మారిందని పేర్కొన్నారు. దొంగలను పట్టుకోవడం మరచి భారాస శ్రేణులనే లక్ష్యంగా చేసుకున్నారని, ఇది మంచి పద్ధతి

కాదని తెలిపారు. తాము తిరిగి అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. తాను కేసీఆర్ అంత మంచోడిని కాదన్నారు. అప్పటివరకు తాము రిటైర్ అవుతామన్న భ్రమలో కొందరున్నారని, ఉద్యోగ విరమణ చేసినా, ఎక్కడున్నా రప్పించి లెక్క సరిచేస్తామని పేర్కొన్నారు.

# పనిచేసే వారికే టికెట్లు ఇస్తాం

**త్వరలో 24 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయి**

**ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకునేవారు ప్రజల్లో ఉండాలి**

**'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్'లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్**

రంగారెడ్డిజిల్లా: కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకే కాంగ్రెస్ టికెట్లు ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు.



ఆదివారం మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన 'జైబాపు.. జైభీమ్..జై సంవిధాన్ అభియాన్'కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో త్వరలో మరో 24 అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పడతాయని, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పెద్ద సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉందన్నారు. కొత్తగా ఏర్పాటు కాబోయే ఆయా నియోజకవర్గాల్లో ఆశావహులందరికీ కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించే వారు ఇప్పటి నుంచే సీరియస్‌గా పార్టీ కోసం పనిచేయాలని, నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలుపించుకోవాలన్నారు.

మతవాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్‌పేరుతో గ్రామాల్లో పర్యటించి, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కార్యకర్తలకు సూచించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు.

జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే

ఉమ్మడి రంగారెడ్డి నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో స్థానం కల్పించకపోవడంతో జిల్లా ప్రజలు నష్టపోవాల్సి వస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై జిల్లా ముఖ్య నేతలంతా ఓ తీర్మానం చేసి, పార్టీ అధిష్ఠానానికి పంపారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలెయాదయ్య, అరికెపూడి గాంధీ ఈ సమావేశానికి హాజరుకాలేదు.

# హుటాహుటిన ఢిల్లీకి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ఆదివారం హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. షెడ్యూలు ప్రకారం సికింద్రాబాద్‌లో సాయంత్రం జరిగే బిహార్ దివస్‌లో



కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆదివారం హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

ఆయన పాల్గొనాల్సి ఉండగా.. దాన్ని రద్దు చేసుకొని హస్తినకు వెళ్లారు. ప్రస్తుతం భాజపా రాష్ట్ర అధ్యక్షుడి నియామకం కోసం కసరత్తు జరుగుతున్న క్రమంలో ఉన్నపళంగా ఆయన ఢిల్లీ పర్యటన రాజకీయ వర్గాల్లో ఆసక్తి కలిగిస్తోంది. సోమవారం పార్లమెంటు సమావేశాల్లో మొదటి ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సి ఉన్నందువల్ల ఆయన ఢిల్లీకి వెళ్లారని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

# కమనీయం... రమణీయం.. శ్రీవారి కళ్యాణం.

**ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న దిల్ రాజు, సినీ ప్రముఖులు.**







వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 23:

ఇందూరు తిరుమల బ్రహ్మోత్స వాల్లో భాగంగా 4వ రోజైన ఆదివారం ఉదయం స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరగగ, సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై వేంచేయగ రథంపై స్వామి వారిని నర్సింగ్ పల్లి గ్రామంలో రహదారుల వెంబడ ఊరేగించారు. రథం దాత "మహబూబ్ నగర్ నివాసి శ్రీమాన్ రాంరెడ్డి కుటుంబ సభ్యులు మొదటగా రథాన్ని లాగగా, గ్రామస్థులు మరియు భక్తులు అందరు రథాన్ని మాడవీధుల మీదుగా గ్రామంలో కి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన ఆడబిడ్డలు మంగళ హారతులతో స్వామి వారిని ఆహ్వానించారు. గ్రామ యువత ఆట పాటలతో రథ యాత్ర లో పాల్గొన్నారు. రథంపై స్వామి వారు ఊరిలోకి రావడంతో గ్రామం మొత్తం శోభాయమానంగా మారింది. ఈ కార్యక్రమాల్లో దేవనాథ జియర్ స్వామి ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి పాల్గొన్నారు. ఆలయ ధర్మక ర్తలైన ప్రముఖ నిర్మాత సోదరులు దిల్ రాజు, శిరీష్ ఉత్సాహంగా రథాన్ని లాగారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, విజయసింహ రెడ్డి, సర్పంచ్ సాయరెడ్డి, ఎంపీటీసీ రాములు, నర్సారెడ్డి, ప్రసాద్, పృథ్వి, నరాల సుధాకర్, రాజేశ్వర్, రమేష్, భాస్కర్, మురళి, యాజ్ఞాచార్యులు శిఖామణి, రోహిత్, నరసింహ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



## ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్స్‌పై కేంద్రం కొరడా

ఢిల్లీ: ఆన్‌లైన్ మనీ గేమింగ్ వెబ్‌సైట్లపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ఆర్థిక శాఖ పరిధిలోని డీజీజీఐ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటలిజెన్స్) బ్లాక్ చేసింది. పన్ను ఎగవేతను అరికట్టడానికి ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ మనీ గేమింగ్ సంస్థలపై డీజీజీఐ కఠినంగా వ్యవహరిస్తోంది. చట్టవిరుద్ధమైన, ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ మనీ గేమింగ్ ఎంటీటీల 357 వెబ్‌సైట్‌లు, URLలను కేంద్రప్రభుత్వం బ్లాక్ చేసింది.

అక్రమంగా నిర్వహిస్తున్న 357 వెబ్‌సైట్లను డీజీజీఐ బ్లాక్ చేసింది. గేమింగ్ సంస్థలకు చెందిన 2,400 బ్యాంక్ ఖాతాలను బ్లాక్ , సీజ్ చేసింది. రూ. 126 కోట్లను డీజీజీఐ ఫ్రిజ్ చేసింది. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లను వాడవద్దని ప్రజలకు డీజీజీఐ సూచించింది. గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లతో లింక్ చేయబడిన 166 మ్యూల్ ఖాతాలను డీజీజీఐ బ్లాక్ చేసింది. ఇప్పటి వరకు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని, విచారణ కొనసాగుతోందని డీజీజీఐ వెల్లడించింది.

## ఎయిర్ ఇండియాపై సుప్రియా సూలే అసహనం




ఎయిర్ ఇండియా విమానంపై ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అసహనం వ్యక్తంచేశారు. తాను ప్రయాణించాల్సిన విమానం కోసం గంటకు పైగా వేచి చూడాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విమానయాన సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖను కోరారు. ఈమేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'ఎయిర్ ఇండియా విమానాలు నిరంతరం ఆలస్యం అవుతున్నాయి. మేము ప్రీమియం ఛార్జీలు చెల్లిస్తాం. అయినప్పటికీ విమానాలు సమయానికి చేరుకోవు. దీని కారణంగా పిల్లలు, వృద్ధులతో సహా అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. నేను ఎయిర్‌ఇండియా సంస్థకు చెందిన విమానంలో ప్రయాణించా. దీనికోసం గంట 19 నిమిషాలు వేచి చూడాల్సి వచ్చింది. ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసే ఇలాంటి ఆలస్యాలు ఆమోదయోగ్యం కావు. విమానయాన సంస్థలకు కఠినమైన నిబంధనలు విధించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని ఈసందర్భంగా కోరుతున్నా. ఇలాంటి జాప్యాలు పునరావృతం కాకుండా ఆయా సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి' అని ఆమె రాసుకొచ్చారు.

## హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు


ఢిల్లీ: ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 2024 ఏడాదికి సంబంధించి జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ శనివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఛత్తీస్‌గఢ్ నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న మొదటి రచయిత శుక్లానే కావడం విశేషం.

భారతీయ సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 'జ్ఞానపీఠ్ అవార్డు'ను అందజేస్తారు. 1944లో ఏర్పాటైన ఈ పురస్కారాన్ని.. దేశంలోనే అత్యున్నత సాహిత్య గౌరవంగా పరిగణిస్తారు. శుక్లా ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయిత. ఈ పురస్కారం కింద రూ.11 లక్షల నగదు, సరస్వతి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు. హిందీ సాహిత్యం, విలక్షణమైన రచనా శైలికి ఆయన చేసిన అద్భుతమైన కృషికిగానూ ఈ అవార్డు వరించింది. 1999లో ఆయన



సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఇక గత ఏడాది ఉర్దూ కవి, సినీ గేయరచయిత గుల్జార్ , సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య ఈ పురస్కారాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.

## న్యూ మెక్సికోలో కాల్పులు.. ముగ్గురు మృతి, 14 మందికి గాయాలు



అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రంలో కాల్పులు కలకలం రేపాయి. లాస్ క్రూసెస్‌లోని యంగ్ పార్కులో శుక్రవారం రాత్రి జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందగా మరో 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు స్థానిక ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. చనిపోయిన వారిలో ఇద్దరు 19 ఏళ్ల వయసు వారు కాగా.. మరొకరి వయసు 16 ఏళ్లుగా పోలీసులు గుర్తించారు. గాయపడిన వారు కూడా 16 నుంచి 36 ఏళ్లలోపు వారేనని వెల్లడించారు.

అమెరికా-మెక్సికో సరిహద్దుకు సమీపంలోని చివాహువాన్ ఎడారికి దగ్గరల్లో లాస్ క్రూసెస్ ఉంది. ప్రతి నెలా ఇక్కడ మార్పులు చేసిన స్పోర్ట్స్ కార్లను ప్రదర్శిస్తుంటారు. శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాదాపు 200 మంది పాల్గొన్నారు. దాంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో యువకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడం.. అందులో కొందరు దుండగులు ఒక్కసారిగా కాల్పులు జరిపి పరారయ్యారు.




## లండన్‌కు.. ఎయిరిండియా సహా ఇతర సర్వీసులు పునఃప్రారంభం

ఓ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం కారణంగా లండన్‌లోని హీత్రో విమానాశ్రయాన్ని అనేక గంటలపాటు మూసివేసిన విషయం తెలిసిందే. తాజాగా పరిస్థితులు మెరుగుపడటంతో విమాన సర్వీసులను పునరుద్ధరించారు. ఈ క్రమంలో హీత్రో విమానాశ్రయానికి రాక పోకలను పునఃప్రారంభించినట్లు ఎయి రిండియా వెల్లడించింది. దీంతోపాటు వర్జిన్ అట్లాంటిక్, బ్రిటిష్ ఎయిర్‌వేస్‌లు కూడా షెడ్యూల్ ప్రకారమే సర్వీసులు నడిపించినట్లు తెలిపాయి. ఎయిరిండియా విమానం ఏఐ 111తో పాటు లండన్‌కు రాకపోకలు సాగించే అన్ని విమానాలు షెడ్యూల్ ప్రకారమే నడుస్తు న్నాయని ఎయిరిండియా వెల్లడించింది. దీంతో పాటు ఫ్రాంక్‌ఫర్ట్‌కు మళ్లించిన ఏఐ161 కూడా అక్కడి నుంచి బయలుదేరుతుందని తెలిపింది. ఢిల్లీ నుంచి లండన్‌కు ఎయిరిండియా నిత్యం ఆరు విమాన సర్వీసులు నడిపిస్తోంది.

వేగుచుక్క

# అంతర్జాతీయంగా నాణ్యమైన విద్య, ఉపాధి లక్ష్యం.






**"ఐటిఎం" యూనివర్సిటీ సంస్థ సీఈవో కృష్ణ, నిజామాబాద్ శాఖ మేనేజర్ కరుణాకర్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 23:**

అంతర్జాతీయంగా యువతి, యువకులకు నాణ్యమైన విద్య, ఉపాధి తమ లక్ష్యం అని "ఐటిఎం" యూనివర్సిటీ సంస్థ సీఈవో కృష్ణ, నిజామాబాద్ శాఖ మేనేజర్ కరుణాకర్ అన్నారు. ఇందులో భాగంగా అడ్మిషన్ మీట్ 2025-26 కు గాను ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు.
జిల్లా కేంద్రంలోని స్థానిక ఎఫ్.సి.ఐ కాలనీ లో గల విశాల్ స్మార్ట్ ఎదురుగా ఐ.టి.ఎం యూనివర్సిటీ బ్రాంచ్ ని ఆసంస్థ సీఈఓ శ్రీ కృష్ణ ఆదివారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ముఖ్య అతి థులు శ్రీ కృష్ణతోపాటు పాటు నిజామాబాద్ శాఖ మేనేజర్ కరుణాకర్ లు మాట్లాడుతూ, యువతి, యువకుల భవిష్యత్తును బంగారు బాట పైపు నడిపించేందుకు తమ సంస్థ స్థాపించబడిందన్నారు. తమ యూనివర్సిటీ ప్రత్యేక దక్షిణ భారతదేశ భాగస్వామి ఆధ్వర్యంలో ఎస్సార్ నగర్, నిజామాబాద్ లలో కలిసి ఐటిఎం యూనివర్సిటీ ద్వారా అడ్మిషన్ మీట్ 2025-26 అకాడమిక్ సంవత్సరానికి గాను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా యువతీ యువ కులు ఈ ప్రత్యేక సమావేశానికి హాజరై, వివిధ కోర్సు లపై సమాచారాన్ని తెలుసు కుని, ఈ సదావకాశాన్ని అందిపుచ్చుకుని తమ ఆహ్వానాన్ని స్వీకరిం చవలసిందిగా కోరారు. ఐటిఎం యూనివ ర్సిటీ భారతదే శంలోని గ్వాలియర్ లో ఉన్న ప్రైవేట్ విశ్వవిద్యాలయమైన యూనివర్సిటీ 1997లో కళాశాలగా ప్రారంభమై 2011లో మధ్యప్రదేశ్ రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా విశ్వవిద్యాలయంగా స్థాపించబడిందని వివరించారు. నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను, అభివృద్ధి చేయడంలో తమ యూనివర్సిటీ విశిష్టత అమోఘమని తెలిపారు. అడ్మిషన్ అవకాశాల కోసం అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్ ప్రోగ్రామ్స్ తోపాటు ఇంజనీరింగ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ, డాటా సైన్స్, మిషన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, ఐ ఓ టి, ఇ.సీ.ఈ, ఇ.ఇ.ఇ, మెకానికల్, బీఎస్సీ ఫోరెన్ సిక్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్, ఇటువంటి అన్ని కోర్సులకు సంబంధించి అతి తక్కువ ఖర్చుతో యువతకు ఉన్నత విద్యను అభ్యసించేలా తన యూనివర్సిటీ పనిచేస్తుందన్నారు. అలాగే తమ యూనివర్సిటీ క్యాంపస్ లో అన్ని వసతులతో పాటు తెలుగు ప్రాంతాల వారికి తగ్గట్లుగా భోజనాన్ని అందించడం తమ క్యాంపస్ ప్రత్యేకత అని చెప్పారు. ఇలాంటి నాణ్యతతో కూడిన వసతులను అందించడమే తమ లక్ష్యం అన్నారు. ప్రపంచ దేశాలలో తమ భవిష్యత్తు కు బంగారు బాట వేసుకునేందుకు తమ యూనివర్సిటీ అవకాశాలను కల్పిస్తోందన్నారు. ఈ మీట్ ను తప్పక సద్విని యోగించుకోవాలని తెలియజేశారు.

# అమరత్వం సూర్యోదయమై ప్రభవిస్తుంది.



**అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో సమాజ శ్రేయస్సుకు కృషి.**

**సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, మార్చి 23:**

అమరత్వం సూర్యోదయమై ప్రభవిస్తుందని, ఆశయం వెన్నెలయి విరగ్గాస్తుందని, నునుగు మీసాల వయసులోనే స్వతంత్ర పోరాటంలో పాల్గొని తెల్లదొరల ఆగడాలను, అరాచకాలను అడ్డుకొని యావత్ భారతీయులలో చైతన్యం నింపి ఉరికంబాలను చిరునవ్వులతో ముద్దాడిన విప్లవ వేగుచుక్కలు భగత్ సింగ్, శివరామ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్ ల త్యాగాల పోరాట స్ఫూర్తితో అమరవీరుల ఆశయాల సాధనకు, సమాజ శ్రేయస్సుకై కృషి చేయాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. స్వాతంత్రోద్యమంలో భారతదేశ దాస్య విముక్తి పోరాటంలో బ్రిటిష్ వారి గుండెల్లో సింహ స్వప్నలైన విప్లవ యువకిశోరాలు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతి, షాహిద్ దివాస్ సందర్భంగా సత్యశోధక్ పాఠశాలలో షాహిద్ భగత్ సింగ్, శివరామ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్ ల చిత్రపటాలకు ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. తదనంతరం ప్రిన్సిపాల్ నర్సయ్య మాట్లాడుతూ, భారత స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తిని నరనరాన రంగరించుకొని స్వరాజ్య కాంక్షను రేకెత్తించి దేశభక్తితో ఆ ముగ్గురి విప్లవత్మక ఆలోచనలు మరియు స్ఫూర్తి స్వాతంత్ర పోరాటం సమయంలో యువతకు ప్రేరణగా నిలిచిన విప్లవ చైతన్య మూర్తుల పోరాట పటిమ, చూపిన తెగువ నేటి యువతకు మార్గదర్శకం కావాలన్నారు. స్వేచ్ఛ భారతం కోసం చిరు ప్రాయంలోనే ప్రాణాలను తృణ ప్రాయంగా త్యాగం చేసిన విప్లవ యువ కిషోరాల చరిత్రను స్మరించుకొని అమరుల వీరుల ఆశయాల సాధనకు, సమ సమాజ స్థాపన ప్రతిఒక్కరం కృషి చేయడమే అమరవీరులకు నిజమైన నివాళి అర్పించడమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారెడ్డి, రవీందర్, అంకిత్ మరియు విద్యార్థులు పాల్గొననైనది.

# భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 23:**

విద్యలో మత జోక్యాన్ని తీసుకువచ్చే నూతన జాతీయ విద్యా విధానం 2020, యుజిసి ముసాయిదా 2025 లకు వ్యతిరేకంగా ను భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పి.డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యార్థి, యువతకు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ రాజు గురు సుఖదేవ్ ల 94వ వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలో కోట గల్లి మరియు సాయి రెడ్డి పెట్రోల్ బంకు వద్ద ఉన్న భగత్ సింగ్ విగ్రహాలకు పి డి ఎస్ యూ ,పి వై ఎల్ , ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా , దోపిడీ వ్యవస్థ పోవాలని పరాయి పాలన ఎదిరిస్తూ నవ యవ్వన ప్రాయంలో దేశ స్వాతంత్రం సమానత్వం కై కామ్రేడ్ భగత్ సింగ్ ,రాజ్ గురు, సుఖ్ దేవ్ లు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని అన్నారు.
వారు మరణించి 94 సంవత్సరాలు గడుస్తున్న వారి ఆశయాలు ఇంకా సజీవంగానే ఉన్నాయని, నేడు దేశంలో స్వదేశీ పాలకులు ఈ దేశ వనరులను పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని, దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, విద్యను మొత్తం కాషాయీకరిస్తూ నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు. యూజీసీ లో కూడా అనేక మార్పులు చేస్తున్నారని పేద బడుగు బలహీన వర్గాలకు ఉన్నత చదువులు దూరం చేయడానికి విద్యలో అనేక పాలసీలను తీసుకువస్తున్నారని అన్నారు.

**పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం మాట్లాడుతూ**

దేశంలో మతోన్మాదం పెరిగిపోయిందని, లౌకిక స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నారని, విద్య నిరుద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ ,రాజ్ గురు, సుఖ్ దే వ్ ల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని విద్యార్థులకు యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్ , మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి జి.రమేష్, మాజీ పి వై ఎల్ నాయకులు
మల్లికార్జున్, న్యాయవాది జి అన్వేష్, పి డి ఎస్ యూ నాయకులు సాయి కిరణ్, నందేవ్, రాహుల్, బస్వరాజు,యువ ఐఎఫ్టియు నాయకులు మోహన్ ,రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల కార్యక్రమాలు అభినదనీయం.





**ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హంధాన్.**

**ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 23:**

జర్నలిస్టులు మతసామరస్యానికి ప్రతీక గా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీ యమని అన్నారు తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అందాన్. రంజాన్ మాసం పురస్కరించుకుని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు.మత పెద్దల ఆధ్వర్యంలో మతబోధనలు మత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో తాహెర్ బిన్ హంధాన్ తో పాటు మాజీ కార్పొరేటర్ ఖుద్దుస్ సీనియర్ నాయకులు జావీద్ అక్రమ్ బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు మునీర్ రషీద్ జర్నలిస్టులు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం లో ముస్లిం మైనారిటీ ల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం భినందనీయమని తాహెర్ బిన్ హందాన్ కొనియాడారు. హిందూ ముస్లిం లు సోదర భావంతో ఐక్యంగా ఉండాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, శేఖర్, కార్యవర్గ సభ్యులు సందీప్, మండే మోహన్, సీనియర్ జర్నలిస్టులు కుంచె వెంకటేష్, ప్రమోద్, గోవింద్ రాజు, నర్స



**నిజామాబాద్: భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు.**

# ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 23:**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ,భారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విరోచితంగా పోరాటం చేసినటువంటి భగత్ సింగ్ ఈ దేశ స్వాతంత్రం కోసం ఉరితా డును సైతం ముద్దాడినటువంటి గొప్ప మహనీయుడనీ అన్నారు. 200 సంవత్సరాల పరిపాలన చేసిన బ్రిటిష్ వారికి బాంబు రుచి చూపించినటువంటి ఒక అగ్గి లాంటి వీరుడు భగత్ సింగ్ భగత్ సింగ్ యొక్క చరిత్రను ఈ తరం యువత కచ్చితంగా తెలుసుకొని ఆయన బాటలో దేశం కోసం ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ప్రవీణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరేందర్, జోనల్ ఇంచార్జ్ దుర్గా దాస్, అభినవ్, వేణు, రాజేష్, రంజిత్, ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

# అమర వీరుల ఆశయాల సాధనకు పోరాడుదాం.

**ప్రముఖ నటుడు, నిర్మాత డాక్టర్ మాదాల రవి పిలుపు.**

**వాసవీ శ్రీ నిలయం లో భగత్ సింగ్ రాజ్ గురు, సుఖదేవ్ ల సంస్మరణ సభ.**








**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్, మార్చి 23:**

దేశం కోసం, ఉన్నత లక్ష్యాలతో బలైన అమర వీరుల ఆశయాల సాధనకు పోరాడుదాం అని ప్రముఖ నటుడు, నిర్మాత డాక్టర్ మాదాల రవి పిలుపునిచ్చారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం
(అమరవీరుల దినోత్సవం) వాసవీ శ్రీ నిలయం, చింతలకుంట , ఎల్ బి నగర్ లో రక్తదాన శిబిరం మరియు అమర వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమమానికి గౌరవ అతిథిగా డా" మాదాల రవి తో పాటు ముఖ్య అతిథిగా నటి, వ్యాఖ్యాత ఉదయభాను, ప్రత్యేక అతిథిగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సి.ఐ.డి) మాధవీలత హాజరయ్యారు. రక్తదాన శిబిరంను డా" మాదాల రవి ప్రారంభించారు. ఈ సంధర్భంగా మాదాల రవి మాట్లాడుతూ, రక్తదానం అనేది మనందరి కనీస బాధ్యత. ఆసుపత్రికి వెళ్ళే ప్రతి ఏడుగురిలో ఒకరికి రక్తం అవసరం ఆవుతుందన్నారు. కొన్నిసార్లు రక్తం దొరక్క చాలా మంది మరణిస్తున్నారనీ, రక్తం మనకు ప్రకృతి ప్రసాదించిన అత్యంత విలువైన బహుమతి అని అన్నారు. రక్తదానం చేయడం అంటే ఓ మనిషికి జీవనదానం చేయడమేనని, మనం ఇచ్చే రక్తం ఆ రోజు కాకపోయిన మరో రోజు ఎవరికో ఒకరికి ఉపయోగపడుతుంది అనీ అన్నారు. ఈనాడు దేశ యువత భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల అమరత్వాన్ని తలచుకొని దేశం కోసం, సమైక్యత కోసం కృషి చేయాలని అన్నారు. వాసవీ శ్రీ నిలయం లో ఒకవైపు రక్త దాన శిబిరం, మరో వైపు షహీద్ దివస్(అమర వీరుల సంస్మరణ సభ) నిర్వహించడంలో మాభూమి సంస్థ కృషిని అభినందించారు. కార్యక్రమంలో నటి ఉదయ భాను, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్,సి.ఐ.డి మాధవీ లత మాట్లాడుతూ, అమర వీరుల ఆశయాల సాధనకు మనమంతా కృషి చేయాలనీ పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో మాభూమి సాహితీ సాంస్కృతిక చైతన్య వేదిక సభ్యులు నరసింహ ప్రసాద్, ఉదయశంకర్, నాగిరెడ్డి, కేశవ రావు, ఎన్ఎస్ఆర్ మూర్తి, శరణ్య, పద్మలత, అలివేలు మంగ, ఇంజమూరి రఘునందన్, శంకర్ పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో 100 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది.

# మదుపర్లకు ఆ సలహాలతో ముప్పే

### నమోదు కాని అడ్వైజర్లపై సెబీ చర్యలు
### 70,000 హ్యాండిళ్లు, పోస్టుల తొలగింపు
### ఫిన్-ఫ్లూయెన్సర్ల వ్యవస్థ అమలు నేపథ్యం



దిల్లీ: పెట్టుబడులపై మదుపర్లను తప్పుదోవ పట్టించేలా సామాజిక మాధ్యమాల ఖాతాల్లో వెలువడుతున్న పోస్టులపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చర్యలు చేపట్టింది. సామాన్యులను తప్పుదోవ పట్టించే 70,000 హ్యాండిళ్లు, పోస్టులను ఆయా ప్లాట్‌ఫారాలతో చర్చల అనంతరం తొలగించింది. గతేడాది ఫిన్-ఫ్లూయెన్సర్ వ్యవస్థను అమల్లోకి తీసుకురావడం ఇందుకు నేపథ్యమని సెబీ పూర్తికాల సభ్యుడు అనంత్ నారాయణ్ పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్న వారిని నమ్మిస్తూ, కొందరు సొమ్ము చేసుకుంటున్నారని.. సెబీ వద్ద నమోదు కాని సలహాదార్లు, రీసెర్చ్ అనలిస్టులు ఈ వ్యవస్థకు 'ఒక ముప్పు'గా మారారని అనంత్ పేర్కొన్నారు. సెబీ వద్ద నమోదైన సంస్థలను గుర్తించడానికి యూపీఐ 'పేరైట్' హ్యాండిల్ సహాయం చేస్తుందని తెలిపారు.

**ఎఫ్‌పీఐ అమ్మకాలు తక్కువే**

ఎఫ్‌పీఐ విక్రయాలు మరీ ఎక్కువగా ఏమీ లేవని.. భారత ఈక్విటీల్లో వీరి పెట్టుబడుల విలువ 2025 ఫిబ్రవరి నాటికి రూ.62 లక్షల కోట్లుగా (700 బి. డాలర్లకు పైగా) ఉన్నాయని వివరించారు. డెట్ విభాగంలో రూ.5.9 లక్షల కోట్ల (68 బి. డాలర్లు) పెట్టుబడులు ఉన్నాయన్నారు. 'గత అయిదేళ్లలో ఈక్విటీ, డెట్‌లో కలిపి వీరు 54 బి. డాలర్ల మేర పెట్టుబడులు పెట్టారు. ఇవి అంతక్రితం అయిదేళ్లతో పోలిస్తే 19 బి. డాలర్లు అధికమ'ని అనంత్ తెలిపారు. ఇటీవల విదేశీ సంస్థాగత మదుపుదార్లు విక్రయించిన మొత్తం రూ.లక్ష కోట్లకు పైగానే ఉందని వివరించారు.

గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌ఈలో బ్రోకర్లకు వెసులుబాటు: గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ-ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సీ)లో మార్కెట్ సంబంధిత కార్యకలాపాలు నిర్వహించడానికి ఒక అనుబంధ సంస్థ/సంయుక్త సంస్థ ఏర్పాటుకు స్టాక్ బ్రోకర్లు తమ వద్ద అనుమతులు తీసుకునే పద్ధతిని తొలగించినట్లు సెబీ పేర్కొంది. దీంతో సంస్థల ఏర్పాటు విషయంలో బ్రోకర్లకు వెసులుబాటు కలిగినట్లయింది.

మున్సిపల్ బాండ్లకు ప్రత్యేక వెబ్‌సైట్: మున్సిపల్ బాండ్లకు ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) తీసుకొచ్చింది. ఈ బాండ్లను కొనుగోలు చేసేవారి కోసం ఒక సెంట్రలైజ్డ్ హబ్‌గా ఇది పనిచేస్తుంది. మదుపర్లకు విస్తృత స్థాయిలో సమాచారాన్ని ఇందులో అందుబాటులో ఉంచుతారు. భారత తొలి మున్సిపల్ బాండ్ సూచీ అయిన 'ద నిఫ్టీ ఇండియా మున్సిపల్ బాండ్ ఇండెక్స్' పనితీరుకు సంబంధించిన గణాంకాలూ ఉంటాయి.

## రిలయన్స్ ట్రెండ్స్‌కు మహేశ్ బాబు, సితార ప్రచారం



హైదరాబాద్: వేసవిని దృష్టిలో పెట్టుకుని, ప్రత్యేక దుస్తుల శ్రేణిని అందుబాటులోకి తెచ్చినట్లు రిలయన్స్ ట్రెండ్స్ వెల్లడించింది. వీటి ప్రచారం కోసం సినీ నటుడు మహేశ్ బాబు, ఆయన కుమార్తె సితారను ప్రచారకర్తలుగా నియమించుకున్నట్లు తెలిపింది. సాధారణ అవసరాల కోసమే కాకుండా వేడుకల కోసం, పాశ్చాత్య దుస్తులనూ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ పేర్కొంది.

## ఖరీదైన వాచీలకు గిరాకీ

### బ్రైట్లింగ్ ఇండియా ఎండీ ప్రదీప్ భానోత్



హైదరాబాద్: భారత్‌లో ఖరీదైన గడియారాలకు గిరాకీ పెరుగుతోంది. స్విట్జర్లాండ్ నుంచి ఏడాదికి రూ.2,500 కోట్ల విలువైన వాచీలు దిగుమతి అవుతున్నాయి. ఇందులో ఏటా 15% వృద్ధి కనిపిస్తోందని బ్రైట్లింగ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ భానోత్ తెలిపారు. హైదరాబాద్‌లో సంస్థ ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడియారాలు స్థోమతకు చిహ్నంగా మారాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 4 విక్రయ కేంద్రాలున్నాయని, రాబోయే 18 నెలల్లో వీటి సంఖ్య 10కి చేరుతుందన్నారు. దేశీయంగా ఖరీదైన వాచీల విక్రయాల్లో తమది మూడో స్థానమని, ఏటా 15 శాతానికి మించి వృద్ధి సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. తమది 140 ఏళ్ల చరిత్ర కలిగిన గడియారం సంస్థ అనీ, అంతరిక్షంలోకి వెళ్లిన తొలి గడియారంగానూ తమ బ్రాండుకు గుర్తింపు ఉందని తెలిపారు. రూ.3.5-12 లక్షల శ్రేణిలో తమ వాచీలు లభిస్తాయని, బంగారు గడియారాల ధర రూ.17 లక్షల వరకు ఉంటుందని అన్నారు.


## దలాల్ స్ట్రీట్‌లో బుల్ రన్.. ఐదో రోజూ లాభాల్లో ముగిసిన సూచీలు



ముంబయి: స్టాక్ మార్కెట్లో బుల్ రన్ కొనసాగుతోంది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లకు మదుపర్లు ఆసక్తి చూపడంతో వరుసగా ఐదో రోజు సూచీలు లాభాల్లో ముగిశాయి. చాలా కాలం తర్వాత స్మాల్ క్యాప్, మిడ్ క్యాప్ స్టాక్‌లు పుంజుకోవడం సూచీలకు కలిసొచ్చింది. వరుసగా విక్రయదారులుగా నిలిచిన విదేశీ సంస్థాగత మదుపర్లు కొనుగోళ్లకు దిగడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. దీంతో సూచీలు లాభాల్లో ముగిశాయి.

సెన్సెక్స్ ఉదయం 76,155.00 (క్రితం ముగింపు 76,348.06) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. 76,095.26 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ కాసేపు లాభ-నష్టాల మధ్య కదలాడింది. తొలుత నష్టాల్లోకి జారుకున్నప్పటికీ ప్రధాన షేర్ల అండతో లాభాల బాటపట్టింది. ఇంట్రాడేలో 77,041.94 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ చివరకు 557 పాయింట్ల లాభంతో 76,905.51 వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో సూచీ 23,402.70 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 159 పాయింట్ల లాభంతో 23,350.40 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, టాటా స్టీల్, ఎంఅండ్ఎం, టైటాన్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు మాత్రమే నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు 85.99 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.76 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,039 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## పెప్సీ, కోకాకోలా నుంచి 10కే నో-షుగర్ డ్రింక్స్




సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్‌లైన పెప్సీ, కోకాకోలా కొత్త వ్యూహాలకు పదునుపెట్టాయి. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ తీసుకొచ్చిన సాఫ్ట్ డ్రింక్ బ్రాండ్ కాంపా నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటున్న తరుణంలో.. పెప్సీ, కోకాకోలా తక్కువ ధరలో సాఫ్ట్ డ్రింక్స్‌ను తీసుకొచ్చాయి. రూ.10తో చిన్న ప్యాక్‌లో డైట్, లైట్ వేరియంట్‌లలో పానీయాలను అందుబాటులోకి తెచ్చాయి. కోకాకోలా, పెప్సీ ఇరు సంస్థలు థమ్స్ ఆఫ్ ఎక్స్ ఫోర్స్, కోక్ జీరో, స్ప్రైట్ జీరో, పెప్సికో నో- షుగర్ అనే బ్రాండ్ల పేరుతో రూ.10కే డ్రింక్స్‌ను ప్రవేశపెట్టాయి. డైట్, లైట్ వేరియంట్లలో నో- షుగర్ పానీయాల్ని తీసుకొచ్చాయి. డైట్, లైట్ వేరియంట్లలో ఈ ధరలో భారత మార్కెట్లలోకి తీసుకురావడం ఇదే తొలిసారి అని కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు తెలిపారు.

## బిలియన్ వీక్షకులే లక్ష్యం.. ఎయిర్‌టెల్, వొడాతో జియో చర్చలు




క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 రేపటినుంచి ప్రారంభం కానుంది. ఈ తరుణంలో వీక్షకుల సంఖ్యను పెంచుకోవాలని జియో హాట్‌స్టార్ చూస్తోంది. మరిన్ని డేటా ప్లాన్లను అందుబాటులోకి తేవాలని చూస్తోంది. తన ప్లాట్‌ఫామ్ సబ్‌స్క్రిప్షన్‌ను జోడించాలని భావిస్తోంది. అందులోభాగంగా ప్రముఖ టెలికాం సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా.. టెలికాం సంస్థలు అందిస్తున్న డేటా ప్లాన్‌లతో జియో హాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌ను బండిల్ చేయాలని చూస్తోంది. యూజర్ల సంఖ్యను పెంచుకొనేందుకు ఈ చర్య సాయపడుతుందని భావిస్తోంది. 2025 ఐపీఎల్‌లో టెలివిజన్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కలిపి 1 బిలియన్ కంటే ఎక్కువమంది వీక్షకులను చేరుకోవాలని జియోస్టార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో టెలికాం డేటా వినియోగం గణనీయంగా పెరుగుతుందని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. 2024 ఐపీఎల్ సమయంలో జియో సినిమాలో వీక్షకుల సంఖ్య 620 మిలియన్లుగా నమోదైంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో 541 మిలియన్లను తాకింది. రిలయన్స్‌కు చెందిన వయాకామ్ 18, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ విలీనం తర్వాత ఏర్పడిన 'జియోస్టార్'కు ఈ ఐపీఎల్ కీలకం. లీగ్ సమయంలో ప్రకటనలతో రూ.4,500 కోట్ల ఆదాయాన్ని పొందాలని చూస్తోంది. ఇప్పటికే 20 మంది స్పాన్సర్‌లను సొంతం చేసుకుంది.

## ఏప్రిల్ 1 నుంచి ఈ నంబర్లకు యూపీఐ సేవలు బంద్ ?



ఇన్‌యాక్టివ్ లేదా వేరే వారికి కేటాయించిన మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు బ్యాంకులు, పేమెంట్ సేవలందించే ప్రొవైడర్లకు.. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసింది. అనధికారిక వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఆ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని సూచించింది. యూపీఐ వినియోగంలో మొబైల్ నంబర్ కీలకం. ఈ సేవల్లో ఓటీపీ వెరిఫికేషన్ కీలక భూమిక పోషిస్తుంది. అందుకే ఎన్‌పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్కువకాలం పాటు వినియోగంలో లేని మొబైల్ నంబర్లను టెలికాం కంపెనీలు వేరొకరికి కేటాయిస్తుంటాయి. దీంతో దీర్ఘకాలం పాటు మనం వాడే నంబర్లు వేరొకరికి చేరుతుంటాయి. దాంతో యూపీఐ ఖాతాలు కూడా వారి చేతిలోకి వెళ్లే అవకాశం ఉంది. దీనివల్ల అనధికారిక, మోసపూరిత లావాదేవీలు జరిగే అవకాశం ఉంది. వీటిని నివారించేందుకు ఎన్‌పీసీఐ ఆదేశాల మేరకు గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్‌తో పాటు బ్యాంకులు ఇన్‌యాక్టివ్ నంబర్లను తొలగించనున్నాయి.

## ఫ్లిప్‌కార్ట్ బాటలో అమెజాన్.. ఆ కొనుగోళ్లపై ప్రాసెసింగ్ ఫీజు

amazon

ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ కొత్త తరహా ఫీజు వసూలు చేయడం మొదలుపెట్టింది. డిస్కౌంట్లపై ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు దానిపై రూ.49 చొప్పున ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేస్తోంది. ఇన్‌స్టంట్ డిస్కౌంట్ రూ.500 దాటినప్పుడు మాత్రమే ఈ మొత్తం వసూలు చేస్తోంది. అంతకంటే తక్కువ ఉన్న సందర్భాల్లో ఈ ఫీజు నుంచి మినహాయిస్తోంది. మరో ఇ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే ఈ తరహా ఫీజు వసూలు చేస్తోంది. ఇప్పుడు అమెజాన్ కూడా దీనికి శ్రీకారం చుట్టింది. ఉదాహరణకు మీరు రూ.10 వేలు విలువైన వస్తువును కొనుగోలు చేశారనుకుందాం. బ్యాంక్ ద్వారా మీకు వెయ్యి రూపాయలు డిస్కౌంట్ లభిస్తే.. వాస్తవంగా రూ.9 వేలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ, రూ.49 ప్రాసెసింగ్ ఫీజు కలుపుకొంటే డిస్కౌంట్ తర్వాత ధర రూ.9049 చెల్లించాల్సి ఉంటుంది.

## గుజరాత్‌లో రూ.7,500 కోట్ల విలువైన ఆర్డర్ పొందిన బీహెచ్‌ఈఎల్

बी एच ई एल BHEL

గుజరాత్‌లోని 'ఉకై' సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.7,500 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందినట్లు ప్రభుత్వ యాజమాన్యంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ శుక్రవారం తెలిపింది. గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ఈ ఆర్డర్ పొందినట్లు 'బిహెచ్ఇఎల్' ఒక ప్రకటనలో తెలిపింది. ఈ యూనిట్ 54 నెలల్లో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది. గుజరాత్‌లోని తాపి జిల్లాలో ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ & కన్స్ట్రక్షన్ ప్రాతిపదికన 1x800 MW 'ఉకై' సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ (యూనిట్-7)ను ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ కింద BHEL ఈ ఆర్డర్‌ను పొందింది.

ఈ ప్రాజెక్టులో BHEL..డిజైన్, ఇంజనీరింగ్, తయారీ, సరఫరా, టెస్టింగ్, కమీషనింగ్‌తో పాటు అవసరమైన అన్ని విద్యుత్, సివిల్, నిర్మాణ పనులను అందిస్తుంది. ఉకైలోని మొదటి థర్మల్ యూనిట్‌ను 1976లో BHEL స్థాపించింది. దశాబ్దాలుగా వీరి విజయవంతమైన భాగస్వామ్యం కొనసాగుతూ ఉంది. దేశవ్యాప్తంగా 1,70,000 MW కంటే ఎక్కువ విద్యుత్ సామర్థ్యాన్ని కలిగి ఉన్న భారతదేశంలోని అగ్రగామి విద్యుత్ పరికరాల తయారీదారుగా.. BHEL ప్రసిద్ధి చెందింది.